క్లుప్తంగా

నేడు సామూహిక సూర్య నమస్కారాలు



వివరాలు వెల్లడిస్తున్న మల్లు వెంకటరెడ్డి

కర్నూలు కల్చరల్: రథ సప్తమి పురస్కరించుకొని తిరుమల తిరుపతి దేవస్థానములు, హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో బి.తాండ్రపాడులోని క్రైడో పాఠశాలలో మంగళవారం ఉదయం 8 గంటలకు సామూహిక సూర్య నమస్కారాల కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు టీటీడీ, హిందూ ధర్మ ప్రచార పరిషత్ జిల్లా కార్యనిర్వాహకులు డాక్టర్ మల్లు వెంకటరెడ్డి, కరస్పాండెంట్ టి.శ్రావ్య కార్తీక్ పేర్కొన్నారు. సోమవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో కార్యక్రమ వివరాలను వెల్లడించారు. విద్యార్థులచే సూర్య నమస్కారాలు, ఆదిత్య హృదయం పారాయణం, యోగాసనాలు చేయించనున్నట్లు వెల్లడించారు.

పోస్టర్ల ఆవిష్కరణ



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఇన్‌చార్జ్ వీసీ ఎన్‌టీకే నాయక్ తదితరులు

కర్నూలు కల్చరల్: రాయలసీమ విశ్వవిద్యాలయంలో సోమవారం వైస్‌చాన్స్‌లర్ చాంబర్‌లో వర్సిటీ ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ ఎన్‌టీకే నాయక్ 'లక్ష డప్పులు – వెయ్యి గొంతుకలు' పోస్టర్లను విడుదల చేశారు. మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు ఈనెల 7వ తేదీన నిర్వహించే 'లక్ష డప్పులు – వెయ్యి గొంతుకలు' సాంస్కృతిక కార్యక్రమంలో పాల్గొనాలని ఎమ్మెస్ఎఫ్ రాష్ట్ర నాయకులు మద్దిలేటి, సుబ్బరాయుడు పిలుపునిచ్చారు. ఎమ్ఈఎఫ్ నాయకులు సుంకన్న, నాగరాజు, హుసేని, మాధవ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

గరుడ వాహనంపై విహరించిన శ్రీహరి



గరుడ వాహన సేవలో బ్రాహ్మణ సంఘం నాయకులు

కర్నూలు కల్చరల్: సంకల్‌బాగ్ హరిహర క్షేత్రంలో నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వసంత పంచమి పురస్కరించుకుని సరస్వతి పూజ, సరస్వతి హోమం, సామూహిక అక్షరాభ్యాసం తదితర ఆధ్యాత్మిక కార్యక్రమాలు జరిగాయి. విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు, జామెంట్రీ బాక్సులు అందజేశారు. అనంతరం శ్రీవారిని గరుడ వాహనంపై కొలువుంచి నగర వీధుల్లో ఊరేగించారు. నగర బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు సండేల్ చంద్రశేఖర్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందన



ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందిస్తున్న వీహెచ్‌పీ నాయకులు

కర్నూలు కల్చరల్: విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించిన రామాయణం పరీక్షలో ప్రతిభ కనబరచిన విద్యార్థులను వీహెచ్‌పీ దక్షిణాంధ్రప్రదేశ్ అధ్యక్షుడు నందిరెడ్డి సాయిరెడ్డి అభినందించారు. వీహెచ్‌పీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. నగరంలోని 15 పాఠశాలల్లో 800 మంది విద్యార్థులు పరీక్షలు రాశారన్నారు. రామాయణం మత గ్రంథం కాదని, భారత జాతీయ గ్రంథమన్నారు. సామాజిక రామాయణంలో ఉండే పాత్రలన్నీ సామాజిక సమరసతను తెలియజేసేనన్నారు. రామాయణ పరీక్షల కన్వీనర్ జంపాల రాధిక, రాష్ట్ర కన్వీనర్ సుబ్రహ్మణ్యం, వీహెచ్‌పీ జిల్లా కార్యదర్శి భానుప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

గర్భిణుల ఆరోగ్యంపై జాగ్రత్త

ఓర్వకల్లు: గర్భిణుల ఆరోగ్యంపై నిరంతరం పర్యవేక్షించాలని జిల్లా నోడల్ అధికారి రఘు అన్నారు. సోమవారం ఓర్వకల్లు మండలం హుసేనాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని కాల్వ గ్రామంలో సంచార వైద్య శిబిరాన్ని తనిఖీ చేశారు ఆయన మాట్లాడుతూ.. మహిళలు గర్భం దాల్చిన సమయం నుంచి ప్రతి నెలా వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. రక్తపోటు, మధుమేహం, రక్తహీనత వంటి సమస్యలు ఉన్న హైరిస్క్ గర్భిణుల విషయంలో సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. వైద్యాధికారి రేఖ, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



కర్నూలు (టౌన్): నగరంలోని పూలబజార్ వద్ద గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. అతడు భిక్షాటన చేస్తూ పొట్టనింపుకునేవాడు. ఆరోగ్యం బాగా లేకపోవడంతో స్థానికంగా కంసాలి సందులో ఉన్న ఆశా మెడికల్ షాపు షట్టర్స్ వద్ద అనుకొని భోజనం చేస్తూ పక్కకు ఒరిగిపోయి కన్నుమూసినట్లు ఒకటవ పట్టణ పోలీసులు సోమవారం వెల్లడించారు. అతనికి సంబంధించిన వ్యక్తులు ఉంటే పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని సూచించారు.

భానోదయం.. ప్రత్యక్ష దైవ దర్శనం

- ఆరోగ్య ప్రదాత ఆదిత్యుని పూజలకు ఏర్పాట్లు
- జిల్లాలోని సూర్యనారాయణ స్వామి ఆలయాల్లో వేడుకల నిర్వహణ
- నేడు రథ సప్తమి (సూర్యనారాయణ స్వామి జయంతి)
- రాష్ట్రంలో రెండో అతిపెద్దది కర్నూలు సూర్యనారాయణ స్వామి ఆలయం



సూర్యనారాయణ స్వామి ఆలయం



సూర్యనారాయణ మూలవిరాట్

కర్నూలు కల్చరల్: ఏ దేవతను సాక్షాత్కారం చేసుకోవాలన్నా అనేక ఆధ్యాత్మిక సాధనలు ఆచరించాలి కానీ అవేవీ అవసరం లేకుండానే నిరంతరం మన ఎదుట ప్రత్యక్షమయ్యే భగవానుడు సూర్యనారాయణుడు. అందుకే దినకరుడు ప్రత్యక్ష నారాయణుడిగా పూజలందుకుంటున్నాడు. మాఘ శుద్ధ సప్తమి రోజున సూర్య భగవానుడి మకర రాశి ప్రవేశమే ఉత్తరాయణ సంక్రమణం, రథ సప్తమి పర్వదినం. ఈ రోజు అత్యంత భక్తిశ్రద్ధలతో వేడుకను జరుపుకుంటారు. రథసప్తమి రోజున సూర్యోదయ సమయంలో గ్రహ నక్షత్రాల సన్నివేశం «రథం» ఆకారంలో ఉంటుందని అందుకే «రథ సప్తమి» అని పేరొచ్చిందని పండితులు చెబుతారు. జిల్లాలోని సూర్యాలయాల్లో మంగళవారం రథ సప్తమి వేడుకలను నిర్వహించేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు.

ఆరోగ్య ప్రదాత

సూర్యారాధనకు ముఖ్యమైన కారణం ఇతడు ఆరోగ్య ప్రధాత. ఉషా కిరణాలతో కలిగే వికసన శక్తి చేతనే సర్వజగతి చేతనత్వం పొందుతుంది. అందుకే 'సర్వ దుఃఖోప శాంతాయ సర్వపాప హరాయచ, సర్వ వ్యాధి వినాశాయ భాస్కరాయ నమో నమః' అన్ని దుఃఖాలను శాంతింప చేసేవాడు, పాపాలను హరించేవాడు, ఆరోగ్యాన్ని ప్రసాదించే ప్రత్యక్ష దేవుడు సూర్యనారాయణ స్వామి. స్వామి వారిని రథ సప్తమి రోజున ఉపాసించటం వల్ల అయురారోగ్య ఐశ్వర్యాలతో పాటు అనంత పుణ్యం ఫలాలను అనుగ్రహిస్తారని శృతి వచనం.

ప్రత్యేక పూజలకు ఏర్పాట్లు

- శ్రీశైలంలో భ్రమరాంబ మల్లికార్జున స్వామి వార్ల ఆలయ ప్రాంగణంలోని పరివార ఆలయాల్లో ఉన్న సూర్యలింగానికి సూర్యోదయ వేళ ప్రత్యేక అభిషేకాలు నిర్వహిస్తారు.
- నందికొట్కూరులోని సూర్య నారాయణ స్వామి ఆలయంలో రథ సప్తమి వేడుకలకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.
- కర్నూలు నగర శివారులోని గణపతి సచ్చిదానంద స్వామి ఆశ్రమంలోని సూర్యనారాయణ స్వామి ఆలయంలో ఉదయం 5 గంటలకు స్వామి మూల విరాట్టుకు అభిషేకం, క్షీరాభిషేకం, సుగంధ ద్రవ్య జలాభిషేకాలు, అరుణ పారాయణం, 7 గంటలకు సూర్యనారాయణ స్వామి స్పటికానికి భక్తులచే స్వయంగా అభిషేకం, 10 గంటలకు అరుణ హోమం, సూర్య పంచాయతన హోమం, సాయంత్రం 6 గంటలకు డాక్టర్ దీక్షితులు సుబ్రహ్మణ్యం (స్త్రీకంఠ గాయకులు)చే భక్తి గానలహరి కార్యక్రమాలు ఉంటాయి.
- దేవనగర్‌లోని సత్యనారాయణ స్వామి ఆలయం ప్రాంగణంలోని సూర్యనారాయణ స్వామి ఆలయంలో ఉదయం నుంచి స్వామి వారి మూల విరాట్టుకు అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక అలంకరణ, భక్తులకు దర్శనం, హోమాలు నిర్వహించనున్నారు.

రాష్ట్రంలో రెండో అతి పెద్ద సూర్యనారాయణ స్వామి ఆలయం

ఆంధ్రప్రదేశ్‌లో అరసవిల్లి తరువాత రెండో అతిపెద్ద సూర్య దేవాలయంగా కర్నూలు సూర్యనారాయణ స్వామి ఆలయం గుర్తింపు పొందింది. 2014లో ఈ ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన జరిగింది. గణపతి సచ్చిదానంద స్వామి ఇక్కడ దత్త పీఠాన్ని ఏర్పాటు చేశారు. స్థానికులు తలా సెంటు భూమిని ఇచ్చారు. లోక కల్యాణార్థం ఈ భూమిలో సూర్య దేవాలయాన్ని నిర్మించాలని స్వామి నిర్ణయం తీసుకోవడంతో ఆలయం రూపుదిద్దుకుంది. దాతల సహకారంతో రూ.8 కోట్లతో ఆలయం నిర్మాణం జరిగింది. 2019లో రథ సప్తమి నాడు విగ్రహ ప్రతిష్ట చేశారు. మందిరంలో స్వామివారు ఛాయా దేవి, ఉషాదేవితో కలిసి భక్తులకు దర్శనమిస్తారు.

పురాణ ఇతిహాసాల సమాహారం

సూర్యనారాయణ స్వామి ఆలయం వర్ణ రంజితంగా ఉంటుంది. ఆలయంపైన సప్తరథాలతో కదలివచ్చే సూర్యనారాయణుడి విగ్రహం నలభై అడుగుల ఎత్తు ఉంది. ఆలయం లోపల, పైభాగం పురాణ ఇతిహాసాల సమాహారంతో ఉంటుంది. లోపలి గోడలపైన సూర్య నమస్కారాలకు చెందిన నమూనా విగ్రహాలు, పైకప్పు పైన పన్నెండు రాశులూ, నవగ్రహాలు, దశావతారాల రూపాలు ఉన్నాయి. గర్భగుడిలో సూర్య భగవానుడు పది అడుగులతో సప్త అశ్వాలతో భక్తులకు దర్శనమిస్తారు.

ఆదిదేవుడి ఆరాధనతో ఆరోగ్య సిద్ధి



ఆధ్యాత్మికంగానే కాకుండా ఆరోగ్యపరంగా ఆది దేవుడైన ఆదిత్యునికి ప్రాధాన్యముంది. సూర్యోపాసన, సూర్య గ్రహ ప్రభావం వల్ల ఆత్మ శక్తి పెరుగుతుంది. నేత్ర శక్తి పెరుగుదలకు, హృద్రోగ నివారణకు, చర్మ సంబంధ వ్యాధుల నివారణకు సూర్యున్నిడిని ఆరాధించాలి. నవగ్రహాల్లో ఏ గ్రహానికి లేని నమస్కార సంప్రదాయం సూర్య గ్రహానికే ఉంటుంది. ప్రత్యక్ష నారాయణున్ని ఎంత భక్తి శ్రద్ధలతో ఆరాధిస్తే అంత ఆరోగ్యం సిద్ధిస్తుంది. – సుబ్రహ్మణ్య స్వామి, పండితుడు, కర్నూలు



సూర్యనారాయణుడి స్పటికం

రేపు బాస్కెట్‌బాల్ ఎంపిక పోటీలు

కర్నూలు (టౌన్): ఈ నెల 5వ తేదీ ఉదయం 10 గంటలకు స్థానిక స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో అండర్–16 విభాగంలో యూత్ బాస్కెట్‌బాల్ ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు బాస్కెట్‌బాల్ సంఘం ప్రతినిధి దాదాబాష సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2009 జనవరి 1 తరువాత పుట్టిన బాలబాలికలు ఈ పోటీల్లో పాల్గొనవచ్చని, ఆధార్ కార్డు, జనన ధ్రువీకరణ పత్రం వెంట తీసుకురావాలని సూచించారు. ఎంపికైన క్రీడాకారులు ఈనెల 8 నుంచి 10వ తేదీ వరకు పిఠాపురంలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ టోర్నమెంటులో పాల్గొంటారని వెల్లడించారు. వివరాలకు 99851 61007 సెల్ నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

5న మహిళా హాకీ ఎంపిక పోటీలు

కర్నూలు (టౌన్): ఈనెల 5వ తేదీన ఉదయం 11 గంటలకు నంద్యాల పట్టణంలోని ఎస్.పీ.జీ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో సీనియర్ మహిళల హాకీ ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు దాసరి సుధీర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 1996 తరువాత జన్మించిన క్రీడాకారులు అర్హులని పేర్కొన్నారు. ఆధార్ కార్డు, జనన ధ్రువీకరణ పత్రం, రెండు ఫొటోలతో హాజరు కావాలని సూచించారు. ఎంపికైన క్రీడాకారులు ఈనెల 8 నుంచి 10వ తేదీ వరకు నెల్లూరు పట్టణంలో నిర్వహించనున్న 15వ హాకీ ఆంధ్రప్రదేశ్ అంతర్ జిల్లాల రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. వివరాలకు 99665 65317 సెల్ నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

కర్నూలు (హాస్పిటల్): ప్రపంచ క్యాన్సర్ అవగాహన దినోత్సవం సందర్భంగా ఈనెల 4వ తేదీన ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు వీఆర్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ అధినేత డాక్టర్ సి.వాసురెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ప్రకాష్ నగర్‌లోని తమ హాస్పిటల్‌లో రోగులకు క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి చికిత్స అందిస్తామన్నారు.

పెద్దాసుపత్రిలో వాటర్ ప్లాంట్ల ప్రారంభం



వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు

కర్నూలు(హాస్పిటల్): హిందుస్తాన్ కోకా కోలా బేవరేజస్, వై4డీ ఫౌండేషన్ (పూణే) వారి సౌజన్యంతో కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో ఓపీ కౌంటర్, సదరం క్యాంపు వద్ద రెండు వాటర్ ప్లాంట్లు ఏర్పాటు చేశారు. వీటిని సోమవారం ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. వేసవి కాలంలో ఆసుపత్రికి వచ్చే రోగులు, సహాయకులకు వాటర్ ప్లాంట్లు ఎంతో ఉపయోగపడతాయన్నారు. సీఎస్ఆర్ఎంవో డాక్టర్ బి.వెంకటేశ్వరరావు, డాక్టర్ రామశివనాయక్, డాక్టర్ కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బాల్యవివాహాలతో ఆరోగ్య సమస్యలు



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న డెమో శ్రీనివాసులు శెట్టి

కర్నూలు(హాస్పిటల్): బాల్య వివాహాల కారణంగా భవిష్యత్‌లో ఆరోగ్య సమస్యలు వస్తాయని డెమో శ్రీనివాసులు శెట్టి చెప్పారు. బాల్య వివాహాల నిర్మూలనపై సోమవారం స్థానిక శ్రీరామనగర్ యూపీహెచ్‌సీ పరిధిలోని ప్రభుత్వ ఎయిడెడ్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అమ్మాయిలకు 18, అబ్బాయిలకు 21 సంవత్సరాల తర్వాత మాత్రమే వివాహాలు చేయాలని, అప్పుడే వారు శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉంటారన్నారు. చిన్న వయస్సులో గర్భదారణ వల్ల గర్భస్రావం, మృతశిశువు జననం, బరువు తక్కువగా పిల్లలు జన్మించడం, తల్లికి తీవ్ర రక్తహీనత వంటి ఆరోగ్య సమస్యలు వచ్చే అవకాశం ఉందని వివరించారు. డిప్యూటీ డెమో చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ.. కిశోర బాలికల్లో ఎదుగుదల త్వరగా ఉంటుందని, వారు ఐరన్, కాల్షియం అధికంగా ఉన్న పాలు, ఆకుకూరలు, కూరగాయలు, గుడ్లు తీసుకోవాలన్నారు. రక్తహీనత నివారణకు వారానికి ఒకసారి ఐరన్ మాత్ర వేసుకోవాలన్నారు. ఆరోగ్య విద్యాబోధకురాలు పద్మావతి, ప్రధానోపాధ్యాయులు శాంత సుహాసిని తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాల కోసం ఆందోళన



జోహరాపురం సచివాలయం ఎదుట ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

కర్నూలు(సెంట్రల్): సొంతిళ్లు లేని పేదలందరికీ ఇంటి స్థలం ఇవ్వాలని కోరుతూ సీపీఎం, సీపీఐ ఆందోళన బాటపట్టాయి. సోమవారం ఆయా పార్టీల నాయకులు సచివాలయాల ఎదుట ఆందోళనలకు దిగారు. సీపీఎం ఓల్డ్‌సిటీ కమిటీ ఆధ్వర్యంలో జోహరాపురం 17, 18 వార్డులకు సంబంధించిన సచివాలయాలు, 81, 82 వార్డులకు సంబంధించి ముజఫర్‌నగర్ సచివాలయం, పాతబస్టాండ్‌లోని సచివాలయం ఎదుట సీపీఐ నాయకులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకులు సాయిబాబా, ప్రభాకర్, సుధాకరప్ప, రంగస్వామి, నాగరాజు, రమణ, సీపీఐ నాయకులు పి.రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ.. ఎన్నికల ముందు సీఎం చంద్రబాబునాయుడు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలన్నారు. పట్టణాల్లోని పేదలకు రెండు సెంట్లు, గ్రామీణ ప్రాంతాల వారికి మూడు సెంట్ల ఇంటి స్థలం ఇవ్వాలన్నారు. అంతేగాక రూ.5 లక్షలు వెచ్చించి ఇంటి నిర్మాణాలు చేపట్టాలని డిమాండ్ చేశారు. సీఎం చంద్రబాబునాయుడు ఇచ్చిన మాటను నిలబెట్టుకోకపోతే ప్రజాప్రతినిధుల ఇళ్లను ముట్టడిస్తామని హెచ్చరించారు. అనంతరం ఆయా సచివాలయ ఉద్యోగులకు వినతిపత్రాలు అందజేశారు.

పాలకుర్తిలో డెంగీ కేసు నమోదు



దోమల నివారణ మందు పిచికారీ చేస్తున్న సిబ్బంది

దేవనకొండ: మండలంలోని పాలకుర్తి గ్రామంలో 16ఏళ్ల బాలిక డెంగీ బారిన పడిందని జిల్లా అధికారుల సమాచారం మేరకు స్థానిక సబ్ యూనిట్ ఆఫీసర్, పీహెచ్‌సీ వైద్య సిబ్బంది, పంచాయతీ కార్యదర్శి నాగరాజు, సర్పంచ్ వీరప్రతాప్ సోమవారం గ్రామంలో పర్యటించారు. దోమల నివారణ మందులను పిచికారి చేయించారు.బాలిక ఇంటి పరిసరాలు చుట్టుపక్కల శుభ్రం చేయించారు. దోమల ద్వారా వచ్చే వ్యాధుల గురించి, పరిసరాల పరిశుభ్రత గురించి గ్రామ ప్రజలకు అవగాహన కల్పించారు. మలేరియా అధికారి సాయిబాబా, సూపర్‌వైజర్స్ రంగస్వామి, హెల్త్ అసిస్టెంట్ రాజు పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన



బ్రోచర్లను విడుదల చేస్తున్న అధికారులు

కర్నూలు(అగ్రికల్చర్): ఆర్థిక అక్షరాస్యతపై సమగ్ర అవగాహన కలిగి ఉండాలని యూనియన్ బ్యాంకు బ్రాంచ్ మేనేజర్ శివశంకర్‌రావు సూచించారు. సోమవారం కర్నూలులోని ఏపీ టౌన్ మోడల్ పాఠశాలలో సొసైటీ ఫర్ సోషల్ ట్రాన్స్‌ఫర్మేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆర్‌బీఐ డిపాజిటర్ ఎడ్యుకేషన్ అండ్ అవేర్నెస్ వర్క్‌షాపునకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఆర్థిక అక్షరాస్యత, సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. బ్యాంకింగ్ సేవలపై అవగాహన పెంచుకొని ఆర్థికంగా బలోపేతం కావాలన్నారు. ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు మేనేజర్ నరేంద్రరెడ్డి మాట్లాడుతూ...వివిధ రఖాల బ్యాంకు ఖాతాల గురించి వివరించారు. సొసైటీ ఫర్ సోషల్ ట్రాన్స్‌ఫర్మేషన్ ప్రాజెక్టు డైరెక్టర్ అశోక్‌కుమార్ మాట్లాడుతూ.. బ్యాంకులు అందించే బీమా పథకాల గురించి అవగాహన కల్పించారు. రిసోర్స్ పర్సన్‌లు రసూల్, అశోక్, ప్రోగ్రామ్ కో–ఆర్డినేటర్ నరసింహ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తూ ముద్రించిన బ్రోచర్లను విడుదల చేశారు.

నర్సింగ్ స్కూల్లో సౌకర్యాలు కల్పిస్తాం

కర్నూలు(హాస్పిటల్): ప్రభుత్వ నర్సింగ్ స్కూల్‌లో అవసరమైన సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు చెప్పారు. ఆయన సోమవారం కలెక్టరేట్ పక్కన ఉన్న ప్రభుత్వ నర్సింగ్ స్కూల్‌ను తనిఖీ చేశారు. నర్సింగ్ విద్యార్థులకు అందిస్తున్న భోజనం, భవనాల గురించి ఆరా తీశారు. నర్సింగ్ స్కూల్‌కు కావాల్సిన ప్లంబింగ్, ఎలక్ట్రికల్ పనులు వెంటనే ప్రారంభం అయ్యేలా చూడాలని హెల్త్ ఇన్‌స్పెక్టర్‌కు ఆదేశించారు. విద్యార్థులకు రుచికరమైన భోజనం అందించాలని డైట్ సిబ్బందికి సూచించారు. అనంతరం శాలమ్మ సత్రంలోని గదులను తనిఖీ చేశారు. ఐపీ రోగులకు వసతుల విషయమై అవగాహన కల్పించాలని జీపీఆర్ ట్రస్ట్ సిబ్బందిని ఆదేశించారు. సీఎస్ఆర్ఎంఓ డాక్టర్ బి.వెంకటేశ్వర్లు, అడ్మినిస్ట్రేటర్ డాక్టర్ కిరణ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

టెంకాయపై ఉరుకుంద ఈరన్న ఆలయ రాజగోపురం





చిత్రకారుడు మల్లికార్జున

ఆదోని రూరల్: మండలంలోని నారాయణపురం గ్రామానికి చెందిన చిత్రకారుడు మల్లికార్జున ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన ఉరుకుంద ఈరన్నస్వామి వారి ఆలయంలో నూతనంగా నిర్మించిన రాజగోపురాన్ని టెంకాయపై చిత్రీకరించి అబ్బురపరిచాడు. ఉరుకుంద ఈరన్నస్వామి వారి మహా కుంభాభిషేకం, రాజగోపురాల ఆవిష్కరణ సందర్భంగా టెంకాయపై పెయింటింగ్ సాయంతో తూర్పు రాజగోపురాన్ని మూడు గంటల పాటు శ్రమించి వేసినట్లు ఆయన తెలిపారు.

కోడుమూరు పీఎస్ తనిఖీ



పీఎస్‌ను తనిఖీ చేస్తున్న ఎస్పీ విక్రాంత్ పాటిల్

కోడుమూరు రూరల్: జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ సోమవారం రాత్రి కోడుమూరు పోలీస్‌స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్‌కు సంబంధించిన రికార్డులను పరిశీలించడంతో పాటు సమస్యాత్మక గ్రామాల వివరాలు, కేసులపై కోడుమూరు సీఐ తబ్రేజ్, ఎస్ఐ శ్రీనివాసులుతో ఆరా తీశారు. విధుల్లో సిబ్బంది బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. స్టేషన్‌కు వచ్చే ప్రజలకు గౌరవం ఇచ్చి వారి సమస్యలు తెలుసుకుని పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

జంతు సంక్షేమానికి కృషి చేయాలి



మాట్లాడుతున్న జేడీ డాక్టర్ శ్రీనివాస్

కర్నూలు(అగ్రికల్చర్): జంతు సంక్షేమానికి ప్రతిఒక్కరూ సహకరించాలని జిల్లా పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ జి.శ్రీనివాస్ కోరారు. సోమవారం వసంత పంచమిని పురస్కరించుకొని కర్నూలు కొండారెడ్డిబురుజు సమీపంలోని బహుళార్థ పశువైద్యశాల ప్రాంగణంలో జీవ జంతు కళ్యాణ్ దివస్ కార్యక్రమం నిర్వహించారు. పలువురు జంతు సంక్షేమ సంఘాల ప్రతినిధులు, జంతుప్రేమికులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జంతువులను సంరక్షించడం, వాటి ఆకలి, దప్పిక తీర్చడం వంటి వాటిపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. భారీ వాహనాల్లో సైతం ఆరు పశువులకు మించి తరలించరాదని, ప్రతి ఆరు గంటలకు ఒకసారి వాటికి మేత, నీరు పెట్టి విశ్రాంతి కల్పించాలన్నారు. జంతువులను హింసించడం, బాధపెట్టడం, భయపెట్టడం, అక్రమంగా రవాణ చేయడం, తలకిందులుగా వేలాడదీసి రవాణ చేయడం నేరమని తెలిపారు. ఇటువంటి నేరాలకు శిక్షలు, జరిమానాలు ఉన్నాయని వివరించారు. జంతు సంక్షేమానికి ప్రతిఒక్కరూ తోడ్పడాలని సూచించారు. ఎస్‌పీఎల్‌ఏ సభ్యులు మణిలాల్‌జైన్, గాయత్రీ గోశాల నిర్వాహకులు జగదీష్, బహుళార్థ పశువైద్యశాల డీడీ హేమంత్‌కుమార్, డివిజినల్ డీడీలు దుర్గాప్రసన్నబాబు, వెంకటరమణ, ఏడీలు భవానీశంకర్‌రెడ్డి, రవిబాబు, సుధాకర్, సుబాన్‌బాష తదితరులు పాల్గొన్నారు.

కలుషిత ఆహారం వ్యాధులకు మూలం



డాక్టర్ శంకర్‌ను సన్మానిస్తున్న వైద్యాధికారులు

కర్నూలు (హాస్పిటల్): మారిన జీవన శైలిలో పౌష్టికాహారాన్ని తీసుకోవడం లేదని, అందువల్లే మందులపై ఆధారపడుతున్నారని ఎన్‌టీఆర్ హెల్త్ యూనివర్సిటీ మాజీ రిజిస్ట్రార్ డాక్టర్ శంకర్ చెప్పారు. సోమవారం కర్నూలు మెడికల్ కళాశాలలోని ఓల్డ్ లెక్చరర్ గ్యాలరీలో ఏర్పాటు చేసిన జీవనశైలి మార్పులు–తక్కువ కార్బోహైడ్రేట్స్, ఎక్కువ ఆరోగ్యకర కొవ్వులు, ఇంటర్మీడియట్ ఫాస్టింగ్ అంశాలపై సెమినార్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మనం తీసుకునే కలుషిత ఆహారం అనేక రోగాలకు మూల కారణమవుతోందన్నారు. ఆహారం, జీవనశైలిలో మార్పులు చేయడం ద్వారా వాటిని సమర్థవంతంగా నివారించుకోవచ్చని తెలిపారు. కార్బోహైడ్రేట్స్ తగ్గించాలని, కోడిగుడ్డును పచ్చసోనతో సహా తీసుకోవాలని, ఆయిల్స్‌లో కోకోనట్ ఆయిల్, వెన్న, నెయ్యి మంచివన్నారు. మిల్లెట్ డైట్ రోగాలకు వైద్యం కాదని, ముందుజాగ్రత్త చర్యల కోసం మాత్రమే ఉపయోగపడుతుందన్నారు. ఉపవాస విషయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. కర్నూలు మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.చిట్టినరసమ్మ, ఫార్మకాలజీ, కమ్యూనిటీ మెడిసిన్, న్యూరాలజీ హెచ్‌ఓడీలు రాజేష్, సుధాకుమారి, శ్రీనివాసులు, స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ డైరెక్టర్ డాక్టర్ సీఎస్‌కే ప్రకాష్, డాక్టర్ దామం శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

పూడికతీత పనులు చేపట్టండి

- ఖాళీ స్థలాల్లో పిచ్చిమొక్కలు, పందుల సంచారాన్ని కట్టడి చేయండి
- సమస్యలకు సత్వర పరిష్కారం
- అదనపు కమిషనర్ ఆర్‌జీవీ కృష్ణ



అదనపు కమిషనర్ ఆర్‌జీవీ కృష్ణకు సమస్యలు వివరిస్తున్న కాలనీ వాసులు

కర్నూలు (టౌన్): ఏక్యాంపు, లక్ష్మీ గార్డెన్స్‌లో రహదారుల శుభ్రత, మురుగు కాల్వల్లో పూడికతీత పనులు చేపట్టాలని స్థానికులు భాస్కర్ రెడ్డి, జయన్న, శంకర్ రెడ్డి విన్నవించారు. సోమవారం స్థానిక నగరపాలక సంస్థ కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. నగర పాలక అదనపు కమిషనర్ ఆర్‌జీవీ కృష్ణ పాల్గొని కాలనీ వాసుల నుంచి వినతులు స్వీకరించారు. సమస్యల సత్వర పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని అదనపు కమిషనర్ హామీ ఇచ్చారు. మేనేజర్ చిన్నరాముడు, ఎస్ఈ రాజశేఖర్, సిటీ ప్లానర్ ప్రదీప్‌కుమార్, ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ విశ్వేశ్వర రెడ్డి, ఆర్ఓ జునీద్ పాల్గొన్నారు.

సమస్యలు ఇవే..

- మహాలక్ష్మీ నగర్, మిలటరీ కాలనీలోని ఖాళీ స్థలంలో పిచ్చిమొక్కలు ఎక్కువగా ఉన్నాయని, పందులకు అవాసంగా మారిందని, తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు జి.రాజేష్ అభ్యర్థించారు.
- సంపత్‌నగర్‌లో పూడికతీత పనులు, వీధి దీపాల మరమ్మతులు, పార్కుల అభివృద్ధి పనులు, మంచినీటి సమస్యను పరిష్కరించాలని స్థానిక కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు మల్లికార్జున రెడ్డి, వెంకటరమణ అభ్యర్థించారు.
- 27వ వార్డు ఆదిత్య నగర్‌లో మురుగు కాల్వలు నిర్మించాలని రైతు సంఘం నాయకులు లక్ష్మీరెడ్డి విన్నవించారు. అలాగే మురుగు కాల్వలు నిర్మించాలని 18వ వార్డు జోహరాపురం సమీపంలోని వెంకటాద్రి నగర్ వాసులు మహేష్ గౌడ్ వినతిపత్రం అందజేశారు.
- పందిపాడు శివారులోని ఇందిరమ్మ కాలనీలో రహదారులు, మురుగు కాల్వలు, వీధిదీపాలు, ఇంటి పన్నులు, మంచినీటి సమస్యను పరిష్కరించాలని స్థానికులు రాధిక, రవి, రామక్రిష్ణ, చంద్రశేఖర్ కోరారు.